Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 238 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 1 - 5 - 2026

94406 62699 rajadhanivartalu X rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# 14 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసు.. కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** 14 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసుకు సంబంధించి భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. అత్యాచార బాధితులు గర్భం దాల్చినప్పుడు.. ఏ సమయంలోనైనా అబార్షన్ చేసుకునేలా కొత్త చట్టాన్ని తీసుకు రావాలని కేంద్రానికి సూచించింది. 14 ఏళ్ల బాలికకు సంబంధించి 30 వారాల గర్భవిచ్ఛిత్తికి ఇటీవల సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయంపై ఎయిమ్స్ వైద్యులు సుప్రీంకోర్టులో 'క్యూరేటివ్ పిటిషన్' దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. గర్భం దాల్చిన ఈ దశలో (30 వారాలు) గర్భవిచ్ఛిత్తి చేస్తే.. భవిష్యత్తులో బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఎయిమ్స్ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కోర్టు స్పందిస్తూ.. వైద్యుల సూచనల నేపథ్యంలో.. తుది నిర్ణయాన్ని బాధితురాలు, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. అత్యాచార బాధితులు గర్భం దాల్చినప్పుడు.. ఏ సమయంలోనైనా దానిని తొలగించుకునేలా కొత్త చట్టాన్ని తీసుకు రావాలని కేంద్రానికి సూచించింది.

# విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు అందిపుచ్చుకోవాలి : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని ఉన్నతాధికారులకు ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి యూనివర్సిటీలతో రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు పోటీ పడేలా చర్యలు తీసుకోవాలని వారిని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గురువారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య తదితర శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. క్వాంటం టెక్నాలజీ కోర్సు ఆంధ్రా యూనివర్సిటీ ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కోర్సును ప్రారంభించిన ఆంధ్రా యూనివర్సిటీని సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సమీక్షలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్, బెంగళూరు నుండి వెళ్లే హజ్ యాత్రికులకు పకడ్బందీగా ఏర్పాట్లు

## - అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ - హజ్ యాత్రికులకు ఏర్పాట్లపై సచివాలయంలో సమీక్ష

## - ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి ఫరూక్ ఆదేశం







**అమరావతి, (రాజధాని వార్తలు):** హజ్-2026 యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హజ్ యాత్రికులకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు, వసతులు కల్పించాలని రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మే 4వ తేదీ నుండి హజ్ యాత్రకు హైదరాబాద్, బెంగళూరు నుండి బయలు దేరే యాత్రికులకు ఏర్పాట్ల కల్పనపై అధికారులతో మంత్రి ఫరూక్ సమీక్ష చేశారు. గురువారం సచివాలయంలోని మూడవ బ్లాక్ లో సమావేశం మందిరంలో సమీక్ష జరిగింది. మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, సభ్యులు, సీఈఓ గౌస్ పీర్‌తో పాటు సంబంధిత పర్యవేక్షణ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏపీ నుంచి ప్రస్తుత ఏడాది దాదాపు 2000 మంది యాత్రికులు హజ్ యాత్రకు వెళ్ళనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఇందులో ఏప్రిల్ 18, 19 తేదీలలో రెండు విడతలుగా విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి 333 మంది యాత్రికులు తరలి వెళ్లిన విషయంను మంత్రి గుర్తు చేశారు. మిగతా యాత్రికులు హజ్ యాత్రకు వెళ్ళేందుకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాలను ఎంచుకోవడం జరిగిందన్నారు.

**మే 4 నుంచి 21 తేదీల మధ్యలో దశలవారీగా హజ్‌కు..**

హైదరాబాద్ నుండి 1202 మంది యాత్రికులు, బెంగళూరు నుండి 447 మంది యాత్రికులు మే 4వ తేదీ నుండి 21 తేదీ మధ్యలో దశలవారీగా హజ్ యాత్రకు బయలుదేరడం జరుగుతుందని, వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో అవసరమైన అన్ని చర్యలను చేపట్టడం జరుగుతుందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఇతర రాష్ట్రాలలోని విమానాశ్రయాల ద్వారా హజ్‌కి వెళ్లే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, తగిన ఏర్పాట్లు, వసతి, వైద్య సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్‌కు మంత్రి ఫరూక్ సూచించారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాలను ఉపయోగించే ఆంధ్రప్రదేశ్ యాత్రికుల కోసం అవసరమైన ఏర్పాట్లలో భాగంగా నోడల్ అధికారులను నియమించడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులైన యాత్రికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక సహాయ సేవల ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని సమీక్షలో నిర్ణయించారు. ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద యాత్రికులకు భద్రమైన, పరిశుభ్రమైన వసతి ఏర్పాట్లును ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం, హజ్ కమిటిల సమన్వయం తో ముందుకు సాగాలని అధికార యంత్రాంగానికి మంత్రి ఫరూక్ దిశా నిర్దేశం చేశారు. మంచి వసతి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజన వసతి, శుద్ధజల తాగునీటి సదుపాయాలు, సేవలందించే సంస్థలను ఎంపిక చేయడం, వాటిపై పర్యవేక్షణ విధానం అమలు చేయడం, విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడం వంటి అంశాలుపై ఆయా రాష్ట్రాల పర్యవేక్షణ బృందాలతో సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్-ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను సులభతరం చేయడం, సహాయ కేంద్రాలు, క్షేత్రస్థాయిలో సహాయక సిబ్బంది నియామకం, విమానాల రాకపోకల వివరాలు, లగేజి నిబంధనలపై ఎప్పటికప్పుడు హజ్ యాత్రికులకు సమాచారం అందించడం, డాక్యుమెంట్ల ధృవీకరణ, తక్షణ సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రాల ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం, గుర్తింపు ధృవీకరణ, రద్దీ నివారణ చర్యలు, రోజువారీ సమీక్షలు, ఫిర్యాదు కౌంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని యాత్రికులు అందరూ తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ హజ్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు.

# అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం స్వర్ణలత

## - వృత్తి పట్ల నిబద్ధత, సేవా దృక్పథం... అదే ఆమె ఆయుధం - కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నిర్వర్తించే తత్వం

## - అదనపు సంచాలకులు స్వర్ణలతకు ఆత్మీయ వీడ్కోలు : సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.విశ్వనాథన్










**విజయవాడ, (రాజధాని వార్తలు):** బాధ్యతల నిర్వహణలో మాత్రమే కాకుండా, అచంచల నిబద్ధతకు, ఉన్నతమైన వృత్తి నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తూ, శాఖ ప్రతిష్టను మరింతగా పెంపొందించడంలో పదవీ విరమణ పొందుతున్న అధికారులు కీలక పాత్ర పోషించారని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.విశ్వనాథన్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనం రెండవ అంతస్థులోని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు ఎల్.స్వర్ణలత, ఉపసంచాలకులు బి.పూర్ణచంద్రరావు, జూనియర్ అసిస్టెంట్ వి.హరిబాబుల ఆత్మీయ పదవీ విరమణ వీడ్కోలు సమావేశానికి సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.విశ్వనాథన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సంచాలకులు కే.విశ్వనాథన్ మాట్లాడుతూ సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు హృదయ పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారన్నారు. తమ సుదీర్ఘ సేవాకాలంలో ప్రతి దశలో వారు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరవేయడంలో వారు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, ఓర్పు ప్రశంసనీయం అన్నారు. తోటి ఉద్యోగులు, జూనియర్ అధికారులకు మార్గనిర్దేశం చేస్తూ, ఆదర్శకులుగా నిలిచారన్నారు. శాఖ కార్యక్రమాల విజయవంతానికి రాత్రింబవళ్లు కృషి చేస్తూ వారు చూపిన అంకితభావం మరువలేనిదన్నారు. పదవీ విరమణ అనేది బాధ్యతల ముగింపు మాత్రమే కాదని వ్యక్తిగత అభిరుచులకు, విశ్రాంతికి దొరికే కొత్త ఆరంభం అని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. వారి అనుభవం, వారు నెలకొల్పిన విలువలు శాఖలో ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయని తెలిపారు.. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సంచాలకులు ఆకాంక్షించారు. సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ కాలంపాటు సేవలు అందించిన అదనపు సంచాలకులు తమ పదవీ విరమణ సంతోషం, సుఖశాంతులతో ఉండాలని కే.విశ్వనాథన్ కోరుకుంటున్నట్లు తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖలో అదనపు సంచాలకులుగా పదవీ విరమణ చేస్తున్న ఎల్ స్వర్ణలత మాట్లాడుతూ.... 1992 నుండి ఇప్పటి వరకు సుదీర్ఘ కాలం సమాచార శాఖలో సేవలందించారని పేర్కొన్నారు. తనకు కుటుంబం తర్వాత సమాచార శాఖే అంతటి ప్రాముఖ్యమని, ఈ శాఖలోని వారందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేశారని ఆమే భావోద్వేగంతో తెలిపారు. వృత్తిలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పనిని ఇష్టపడి ఆస్వాదిస్తూ చేశానని చెప్పారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కార్యాలయంలో పనిచేస్తూ జోన్ 1, 2 మరియు 3 పరిధిలోని అన్ని జిల్లాల వారితో సాన్నిహిత్యం కలిగి ఉన్నానని, జోన్ 4లో విద్యాభ్యాసం జరిగిందని గుర్తు చేసుకున్నారు. తనకు సహకరించిన ఉన్నతాధికారులు, ఇతర మిత్రులు, సహోద్యోగులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి ఓఎస్డీ డాక్టర్ ఎన్.ప్రకాశరావు, మాట్లాడుతూ.. ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో వారు ప్రదర్శించిన ఓర్పు, సమయస్ఫూర్తి అభినందనీయమన్నారు.

పదవీ విరమణ సందర్భంగా ఎల్.స్వర్ణలత, బి.పూర్ణచంద్రరావు, వి.హరిబాబులు చేసిన సేవలను కొనియాడుతూ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. వీడ్కోలు కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు పి. కిరణ్ కుమార్, కస్తూరి బాయి తేళ్ల, ఐ.సూర్యచంద్రరావు, ఛీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూధన్, ఆర్ఐఈ లు కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ టి.నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు పి. తిమ్మప్ప, పి.వెంకట్రాజ్ గౌడ్, డి.రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, కే.నారాయణ రెడ్డి, పి.రాజశేఖర్, తిరుపాలయ్య, ఎస్వీ మోహన్ రావు, ఏవో పి.సుదర్శనరావు, జేఈవో నాగరాజు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మర్రి ఆకుపై కార్వింగ్‌తో పూజ్య బాబూజీ మహారాజ్ చిత్రం. ..సోమా పద్మారత్నం

## - పెన్సిల్ ఆర్ట్...బాబూజీ, దాజీ చిత్రాలు...సోమ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకులు పూజ్య ఆధ్యాత్మిక గురువు దేవులు బాబూజీ మహారాజ్ 127వ జయంతి వేడుకలు సందర్భంగా హైదరాబాద్‌ని కన్హా శాంతి వనంలో ఎంతో ఘనంగా జరుగుతున్న సందర్భంగా వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపుతూ ప్రముఖ సూక్ష్మ చిత్రకారుడు, తెలుగు పండిట్ సోమా పద్మారత్నం చిత్రం ఆకు పై కార్వింగ్ చేయడం జరిగింది. హైదరాబాద్‌లో రెండు వేల ఎకరాల్లో నిర్మిత మైన సువిశాలమైన ఈ ఆధ్యాత్మిక క్షేత్రం లోని మెడిటేషన్ హాల్లో ఒకేసారి లక్ష మంది కూర్చొని ధ్యానం చేయగలిగేంత ప్రపంచం లోనే అతి పెద్ద హాలు, నీళ్ళేలేని కొండలు బండలతో కూడిన ఈ ప్రదేశంలో నేడు అనేక లక్షల మొక్కలతో, పచ్చదనంతో, అనేక రకాల సదుపాయాలతో నేడు హార్ట్ ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్యాత్మిక గురువు దేవులు కమలేష్ పటేల్ మనం ఎంతో ముద్దుగా పిలువబడే దాజీ ఆధ్వర్యంలో కోట్ల మంది అభ్యాసులు ఈరోజు ధ్యాన శిక్షకులుగా తయారై ప్రపంచ శాంతికి మూలమై, ఈ కన్హా శాంతి వనంలో దాజీ, మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్‌లు కార్యక్రమంలో భాగస్వాములై మన దేశంలోని అన్ని విభిన్న ఆధ్యాత్మిక గురువులందరినీ ఒకే వేదికపై నిలిపి, మన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందరూ ఈ వేదికపై ధ్యానం చేయడం జరిగింది. అలాగే మన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మా రాష్ట్రంలో కూడా ఆధ్యాత్మిక కన్హా శాంతి వనంను నెలకొల్పవలసిందిగా మన మాస్టారు దాజీని కోరడం జరిగింది. ఈ హార్ట్ ఫుల్ నెస్ సెంటర్ ఆధ్యాత్మిక గురువు దేవులు లాలాజీ, బాబూజీ, చారీజీ, దాజీ లకు అభివందనాలు తెలియజేసుకుంటున్నాము.

# లెట్స్ హెల్ప్ ఎవ్రీవన్ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా 50 గొడుగులు పంపిణీ









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** లెట్స్ హెల్ప్ ఎవ్రీవన్ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలో రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులకు 50 గొడుగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లెట్స్ హెల్ప్ ఎవ్రీవన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.సుజిత్ వర్మ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలో రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులకు 50 గొడుగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. సమాజ సేవే తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రోడ్ల పక్కన జీవనోపాధి సాగిస్తున్న చిరు వ్యాపారస్తులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. అదే విధముగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజు మాట్లాడుతూ లెట్స్ హెల్ప్ ఎవ్రీవన్ ఫౌండేషన్ అధినేత సుజిత్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. వారు చేస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని వారు చేస్తున్న సేవలకు ఎప్పుడూ తాము అండగా ఉంటామని, సేవా కార్యక్రమాలకు తోడుగా నిలుస్తామని తెలిపారు.

అలాగే లెట్స్ హెల్ప్ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, సుజిత్‌కి మరియు వారి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెట్స్ హెల్ప్ ఎవ్రీవన్ ఫౌండేషన్ సభ్యులు ఎస్. నవీన్, శ్రీను రెడ్డి, పొట్టే పాలెం యూత్ మరియు ఓంసాయి ఫౌండేషన్ వ్యవస్థాపకులు హరిబాబు, పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజు మరియు ఎల్‌హెచ్‌ఇ టీం స్నేహితులు మరియు స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే పాశంను సత్కరించిన సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి



**కోట, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ బలోపేతంలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ నిరంతరం శ్రమిస్తున్న గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయి నమోదైంది. పార్టీ అధిష్టానం ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేస్తూ, రాష్ట్ర స్థాయిలో అత్యంత కీలకమైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ పరిణామం గూడూరు నియోజకవర్గ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని, ఒక నిబద్ధత కలిగిన నాయకుడికి దక్కిన సముచిత గౌరవమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. డాక్టర్ పాశం సునీల్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన తరుణంలో, ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు టీడీపీ యువ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి వారిని కలిసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ పాసిం సునీల్ కుమార్ మొదటి నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజాసేవలో ముందున్నారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ ఆయన చేస్తున్న పోరాటాలను గుర్తించిన పార్టీ అధినాయకత్వం, రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం గూడూరు గడ్డ గర్వించదగ్గ విషయం అని సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి కొనియాడారు. కేవలం నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడంలో పాసిం సునీల్ కుమార్ తనదైన ముద్ర వేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చదువుకున్న వ్యక్తిగా, డాక్టర్‌గా సేవా దృక్పథం కలిగిన ఆయనకు ఈ పదవి దక్కడం వల్ల రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త జోష్ వస్తుందని పేర్కొ న్నారు.

**గూడూరు అభివృద్ధికి నవ వసంతం**

సునీల్ కుమార్ రాష్ట్ర స్థాయి పదవిలో ఉండటం వల్ల గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు, అవకాశాలు వచ్చే వీలుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ సందర్భంగా సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాయకత్వంలో గూడూరు అన్ని రంగాల్లో దూసుకుపోవాలని, పారిశ్రామికంగా, సామాజికంగా నియోజకవర్గ రూపురేఖలు మారాలని ఆకాంక్షించారు. ప్రజాసేవయే పరమావధిగా సాగుతున్న ఎమ్మెల్యే ప్రయాణం, యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన మార్గదర్శకత్వంలో తామంతా పార్టీ కోసం, నియోజకవర్గ ప్రగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు.

**నియోజక వర్గ వ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు**

ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడంతో గూడూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో టీడీపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుతూ కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగిన తీరు ప్రతి ఒక్కరిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో పాశం సునీల్ కుమార్ కీలక పాత్ర పోషించాలని, ఆయన మరెన్నో ఉన్నత పదవులను అధిష్ఠించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ, నియోజకవర్గ ప్రజల తరపున ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# నేడు అనంతవరం గ్రామంలో పల్లె వీక్షణ

## - అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వినూత్నంగా చేపట్టిన "పల్లె వీక్షణ" కార్యక్రమం గురువారం దగదర్తి మండలం అనంతవరం గ్రామంలో నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ సరికొత్త ఆలోచనతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఇప్పటికే ఆత్మకూరు మండలం బోయిల చిరువెల్ల గ్రామం, సీతారామపురం మండలం మారంరెడ్డిపల్లె గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించారు. మూడో విడతగా అనంతవరం గ్రామంలో ఈ పల్లె వీక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతవరం గ్రామంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఉపాధి హామీ పథకం పనులను సమీక్షించడం, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించడం, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తారు. అలాగే మినీ గోకులం కేంద్రాన్ని సందర్శించి, చెత్త వర్గీకరణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. హౌసింగ్ లేఅవుట్ పురోగతిని సమీక్షించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, డీఆర్‌డీఏ స్టాల్, మెడికల్ క్యాంప్, వెటర్నరీ ఫీడ్ మరియు సీడ్ స్టాల్‌లను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామ ప్రజలతో కలెక్టర్ నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

# సీఎం రేవంత్‌ని కలిసిన కొత్త డీజీపీ సీవీ ఆనంద్

## - శాంతిభద్రతల పరిస్థితి మెరుగుదలపై సీఎం సూచనలు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పూర్తిస్థాయి డీజీపీగా నియమించినందుకు గాను ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై సీఎంతో చర్చించానని, భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేశారని సీవీ ఆనంద్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా.. రాష్ట్ర ప్రజలకు సేవ చేయడానికి, రక్షణ కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సీఎంకు హామీ ఇచ్చినట్లు చెప్పారు.

**మే 1న సీఎంను కలిసి ధన్యవాదాలు తెలపనున్న ఆర్టీసీ జేఏసీ**

తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఆర్టీసీ కార్మికులు ఇటీవల చేసిన సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, అందుకు కృతజ్ఞతగా మే 1న సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సీఎంను ప్రత్యేకంగా కలిసి ధన్యవాదాలు తెలపనున్నామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటన వంటి పలు కీలక అంశాలపై ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని చెప్పారు.

# సీఎంఆర్ బకాయిలపై సర్కార్ సీరియస్

## - పరిమాణంతో పాటు 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీ వసూలు - బకాయిలు చెల్లించిన వారికే కొత్త ధాన్యం కేటాయింపులు

## - ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్

**హైదరాబాద్/మహబూబాబాద్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలు పేరుకుపోయిన రైస్‌మిల్లర్ల పట్ల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని, తిరిగి బియ్యం అప్పగించడంలో విఫలమైన మిల్లర్ల నుంచి జరిమానా, వడ్డీతో సహా మొత్తం వసూలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ముఖ్యంగా 2024-25 ఖరీఫ్ సీజన్‌తో పాటు 2014-15 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న బియ్యం బకాయిలకు సంబంధించి, ఆ పరిమాణం విలువకు సమానమైన ధరతో పాటు 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీని కలిపి వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఫిబ్రవరిలో ముగిసిన ఒప్పంద గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ, ఈ లోపు బకాయిలు చెల్లించిన మిలర్లకు మాత్రమే కొత్తగా ధాన్యం కేటాయిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. మరోవైపు, మహబూబాబాద్ జిల్లాలో అధికారులు బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో మొత్తం 80 రైస్ మిల్లులు ఉండగా, అందులో 21 మిల్లులను డిఫాల్ట్ మిల్లులుగా సివిల్ సప్లై అధికారులు గుర్తించారు. దాదాపు 13 ఏళ్లుగా పేరుకుపోయిన ఈ బకాయిల వసూళ్ల కోసం ఇప్పటికే ఆరు మిల్లులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలు చేపట్టగా, మరో పది మిల్లుల యజమానులపై కేసులు పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి బదులుగా 67 బియ్యాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అయితే గత అధికారుల ఉదాసీనత వల్ల ఈ బకాయిలు పెరిగిపోయాయి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో నిబంధనలు పాటించిన 59 మిల్లులకు మాత్రమే సీఎంఆర్ ధాన్యం కేటాయించి, బకాయిలు ఉన్న 21 రైస్ మిల్లులను పక్కన పెట్టారు. జూన్ 15లోపు పెనాల్టీతో సహా బకాయిలు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నర్సింహారావు మిల్లర్లను హెచ్చరించారు.



# నెల్లూరు నగర నియోజకవర్గంలో వైసీపీకి లభిస్తున్న ఆదరణ

## - టిడిపి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన 100 కుటుంబాలు - సిటీ ఇంచార్జ్ ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇస్తున్న భరోసాతో కార్యకర్తల్లో నూతనోత్సాహం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో 53వ డివిజన్ వైసిపి నాయకులు భాగి వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపిని వీడి 100 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీల చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

చంద్రశేఖర్ రెడ్డి కామెంట్స్ :

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమే ఈ చేరికలు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం గాడి తప్పిందని కూటమి పార్టీలు ప్రజావిశ్వాసాన్ని కోల్పోయాయి. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనను ఎందుకు దూరం చేసుకున్నామా అని ఈ ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్ళీ ఈ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో వైసిపి స్టేట్ సెక్రటరీ పేర్నాటి కోటేశ్వర రెడ్డి, 53వ డివిజన్ ఇంచార్జ్ వెంగల్ రెడ్డి, డివిజన్ నాయకులు పరంధామయ్య శరత్, 54వ డివిజన్ ఇన్‌చార్జ్ మస్తాన్, వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# విలేకరిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

## - విలేకరుల రక్షణకు ప్రత్యేక చట్టాలను అమలు చేయాలి



**గూడూరు, (రాజధాని వార్తలు):** చిత్తూరు జిల్లా వి.కోట ఆంధ్రజ్యోతి విలేకరిని అతి దుర్మార్గంగా కత్తులతో నరికి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని గూడూరు ప్రింట్, ఎలక్ట్రా నిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆధ్వర్యంలో రౌడీషీటర్‌ను కఠినంగా శిక్షించాలంటూ నిరసన చేసి ఆర్డీఓ సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు షేక్ జమాలుల్లా, మందా ప్రభుదాస్‌లు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి నడుమ వారధులుగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలు, అవినీతిపరులు, ఎర్ర చందనం, ఇసుక, క్వార్జ్ మాఫియాలపై కథనాలు ప్రచురితం చేస్తున్న పాత్రికేయులపై దాడులకు పాల్పడడం, హతమార్చడం దారుణ మన్నారు. వీ.కోట విలేకరి జగన్మోహన్ రెడ్డిని రౌడీషీటర్లు హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునేలా క్రూరంగా హత్య చేసిన దుండగులను నడి రోడ్డులో ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకో వాలన్నారు. మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పేటిటి గిరి, అల్తాఫ్, గుమ్మడి అనిల్ (నాని), కోటేశ్వరరావు, నిరంజన్, శంకర్, వెంకటేశ్వర్లు, జనార్ధన్, సుబ్బరాజు సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఇమ్రాన్, కృపానిధి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ




**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్ర జ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసనగా బుధవారం సుళ్లురుపేటలోని జర్నలిస్టులు బారి నిరసన కార్యక్రమం చేప ట్టారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి కొవ్వొత్తుల ర్యాలీతో నినాదాలు చేస్తూ సూళ్లురుపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణకి వినతి పత్రం అందిం చారు. హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షిం చాలని, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని, చనిపో యిన జర్నలిస్టు కుటుం బానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరూ పాల్గొన్నారు.

# లారీ ఢీకొని వ్యక్తి మృతి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం వాలు తిమ్మాపురం జంక్షన్ వద్ద ఎడిబి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని వాలుతిమ్మాపురం గ్రామానికి చెందిన వ్యక్తి శెట్టిబత్తుల సత్తిబాబు (40) మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైనట్టు తెలిసింది. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్ఐ వి మౌనిక సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ప్రమాదం కారణంగా ఏడీబి రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదంపై కేసు నమోదు చేసి పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు. అయితే ఏడిబి రోడ్డులోని వాలు తిమ్మా పురం జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎవరో ఒకరు మృత్యువాతకు గురవుతున్న సంద ర్భాలు ఉండటంతో పాటు నిత్యము ట్రాఫిక్ వల్ల వాలు తిమ్మా పురం రోడ్డుకు వెళ్లే దారిలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఆ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ సరిగ్గా లేకపోవడం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు గమనించి ఈ సెంటర్ వద్ద ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ను ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ దంపతులకు కవలలు

## - సర్కారు వైద్యంతో సాకారమైన పదేళ్ల కల




**అడ్డగుట్ట, (రాజధాని వార్తలు):** సంతానం కోసం పదేళ్లుగా నిరీక్షిం చిన ఆ దంపతుల కల గాంధీ ఆస్పత్రిలో సాకారమైంది. సికింద్రా బాద్ బోయిగూడకు చెందిన గడ్డం త్రివేణి, మస్తాన్‌రావు దంప తులు సంతానం కోసం ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరకు గాంధీ ఆస్పత్రిలోని ఐవీఎఫ్ విభాగాన్ని ఆశ్రయించగా, బుధవారం ఈ దంపతులకు పాప, బాబు జన్మించారు. గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపిన వివరాల ప్రకారం..ఇదే చికిత్స కోసం ఆ దంపతులు కొన్ని ఆస్పత్రుల్లో 13 సార్లు ప్రయత్నించినప్పటికీ సంతానం కలగలేదు. కార్పొరేట్ ఆస్పత్రులకు వెళితే రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వెనకడుగు వేశారు. చివరకు గాంధీ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ (మదర్, చైల్డ్) విభాగంలో వైద్యం చేయించుకుందామని నిర్ణయించుకున్నారు. గాంధీలో చికిత్స తీసుకుని, గర్భం దాల్చిన ప్పటి నుంచి డెలివరీ వరకు ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందిం చామని డాక్టర్ వాణి తెలిపారు. ప్రస్తుతం తల్లి శిశువులు ఆరో గ్యంగా ఉన్నారని చెప్పారు. సమాచారం తెలుసుకున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహా గాంధీ ఐవీఎఫ్ సెంటర్ వైద్యులను అభినందించారు.

# ఘనంగా చిట్టబ్బాయి 5వ వర్ధంతి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమ లాపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కుడుపూడి చిట్ట బ్బాయి 5వ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమలాపురం పట్టణ పరిధితో పాటు నియో జకవర్గంలో సామాజిక వర్గాల మధ్య సత్సంబంధాలు, అభివృద్ధి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ రావు, అమలాపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, గన్నవరం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, వైయస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎస్ పిసి మెంబర్ కుడుపూడి భరత్, కాశి మునికుమారి, పట్టణ అధ్యక్షులు సంసాని నాని, పేరి శ్రీను, మట్టపర్తి నాగేంద్ర, షేక్ ఖాదర్, మాజీ మున్సి పల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, కొనుకు బాపూజీ, ఇళ్ల శేషారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీకి కేంద్రం భారీగా నిధులు.. స్పందించిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ :** వికసిత భారత్– గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ (వీబీజీఆర్ఏఎం) కింద రూ.1192.16 కోట్ల నిధులను ఆంధ్రప్రదే శ్‌కు కేంద్ర ప్రభుత్వం గురువారం మంజూరు చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల్లో మెటీరియల్ కంపోనెంట్‌కు రూ.1123.15 కోట్లు, అడ్మిన్ కంపోనెంట్‌కు రూ.69.01 కోట్లు వినియోగిం చనున్నారు. ఈ నిధుల విడుదలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. గ్రామీణ ఉపాధి అవకాశాలు విస్తరించడంలో ఈ నిధులు కీలక పాత్ర పోషి స్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, వారి జీవనో పాధిని బలోపేతం చేస్తాయని మంత్రి పెమ్మసాని తెలిపారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడ తాయని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కూలీలకు వేతనాలు నేరుగా చేరే విధంగా పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి.. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం తీసుకు రావడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిధుల వినియో గంలో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మంచి ఫలితాలు సాధిస్తాయ న్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఈ సంద ర్భంగా మంత్రి పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను సమర్థవంతంగా వినియోగి స్తుందని ఆకాంక్షించారు. ప్రతి గ్రామానికి ఉపాధి అవకాశాలను అందిస్తుం దన్నారు. ఈ నిధులు గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భరోసా కల్పిస్తూ, సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని మంత్రి పెమ్మసాని తెలిపారు. మరోవైపు దీనదయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పథకం కింద రూ.207 కోట్ల నిధులను ఏపీకి కేంద్రం బుధవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. గత యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకు వచ్చింది. దీనిని ఎన్డీయే ప్రభుత్వం ఇటీవల వికసిత భారత్– గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ (వీబీజీఆర్ఏఎం)గా ఆ పథకం పేరు మార్చిన విషయం విదితమే.

# ఆకివీడు రామాలయ నిర్మాణం అంశంపై ఏపీ హైకోర్టులో విచారణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకి వీడు రామాలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఏపీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఆలయ నిర్మా ణాన్ని నిలిపి వేయాలంటూ వేసిన పిటిషన్లను పిటిషనర్లు ఉప సంహరించుకున్నారు. రామాలయం నిర్మాణానికి అన్ని అనుమ తులు ఉన్నాయని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరిం చారు. రామాలయం ప్లాన్‌తో పాటు ఆర్డీవో, ఎమ్ఆర్వో ఇచ్చిన అనుమతుల వివరాలను తెలిపారు. దీంతో 'రామాలయం నిర్మాణం చేసుకోవచ్చు కదా' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ దశలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్ మాట్లాడు తూ..'పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని' తెలిపారు. అయితే ప్లాన్‌ను సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. పిటిషన్ ఉపసం హరణకు అనుమతి ఇవ్వాలని కోరగా.. అందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.

# సంపాదకీయం

## ఈ మానసిక దాస్యం నుంచి విముక్తి ఎప్పుడు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏప్రిల్ 18న జాతి నుద్దేశించి ప్రసంగించారు. మన ప్రజాస్వామ్యంలో అత్యున్నత రాజకీయ స్థానంలో ఉన్న నాయకుడు ప్రధాన మంత్రి. కనుకనే మనలో చాలా మందికి ఆ ప్రభావ దాయక వ్యక్తి ప్రసంగం ఒక అత్యవసరమైన సందేశాన్ని సూచిస్తుంది. రాష్ట్రపతి కూడా కొన్ని సందర్భాలలో జాతి నుద్దేశించి ప్రసంగిస్తారు. అయితే అవి కేవలం లాంఛన ప్రాయంగా చేసే ప్రసంగాలే. ప్రధానమంత్రి ప్రసంగాలు భిన్నమైనవి. దేశం ఒక సంక్షోభం ముంగిట ఉన్నప్పుడో లేదా దేశ పౌరులలో ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రభావితం చేసే విధాన నిర్ణయం తీసుకున్నప్పుడో ప్రధానమంత్రి జాతి జనుల నుద్దేశించి ప్రసంగిస్తారు. పెద్ద విలువగల కరెన్సీ నోట్లను రద్దు చేస్తున్న విషయాన్ని నవంబర్ 8, 2016 రాత్రి ఎనిమిది గంటల సమయంలో దేశ ప్రజలకు ప్రధానమంత్రి తెలియజేయడాన్ని, అలాగే మార్చి 24, 2020న దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలుపరుస్తున్నట్టు ప్రకటించడాన్ని ఎవరు మరచిపోగలరు? ఈ కారణంగానే ప్రధానమంత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారంటే ఆ ప్రసంగ విషయానికి ఎంతో ప్రాధాన్యముంటుంది, ఆ విషయ అత్యావశ్యకతను అది సూచిస్తుంది. అయితే ఈ నెల 18న దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి అటువంటి ప్రాధాన్యమేదీ లేదు. భారత జాతీయ పతాకం వెనుక ఉండగా వెలువరించిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్‌ను ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని ఆయన ఆరోపించారు. నిజానికి డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)తో మహిళలకు మరిన్ని సీట్లు కేటాయించే అంశంతో ముడిపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 పార్లమెంటు ఆమోదం పొందలేకపోయింది. చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించే ప్రయత్నంలో తమ ప్రభుత్వం విఫలమయినందుకు భారత మహిళలకు ఆయన క్షమాపణలు చెప్పారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఆ ప్రసంగం చేయడం ఒక అసాధారణమైన విషయం. రెండు కీలక రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరగనుండగా ఆయన ఆ ప్రసంగం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రధాన మంత్రిగా ఆయన ఆ ప్రసంగం చేయకూడదు. అయితే భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మోదీపై ఎలాంటి చర్య తీసుకోకపోగా నామమాత్రంగానైనా ఆక్షేపణ తెలుపలేదు. సరే, మోదీ ఆ ప్రసంగం చేయడం ద్వారా తాను నిర్వహిస్తున్న అత్యున్నత పదవి రాజకీయ హుందాను కళంకపరిచారు. ఎటువంటి వాదనలూ ఆయన ఆ ప్రసంగాన్ని చేయడాన్ని న్యాయసమ్మతం చేయలేవు. నరేంద్ర మోదీ చర్యలో రాజకీయ నైతికతను అలా ఉంచితే ఆయన ప్రసంగానికి దేశ పౌరుల ప్రతిస్పందన నాకు అమిత ఆసక్తి గొలుపుతోంది. దానిని నిశితంగా పరిశీలించవలసిన అవసరమున్నది. మన రాజ్యాంగంపై అవగాహన ఉన్న కొద్ది మంది పౌరులు, ప్రధానమంత్రిగా మోదీ ఆ ప్రసంగం చేయడాన్ని ఆక్షేపిస్తూ ఈసీఐకి లేఖలు రాశారు. సామాజిక మాధ్యమాలలో మోదీ చర్యపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. మోదీ ప్రసంగాన్ని తప్పుపట్టినవారు ఎంతో మంది లేరని చెప్పడం సత్యదూరమేమీ కాదు. ఆయన తన అభిప్రాయాన్ని ప్రజలకు నివేదించారని, ప్రధానమంత్రి కనుక ఆయన ఆ అధికార స్థానం నుంచి దేశ ప్రజలతో సంభాషించారని చాలా మంది భావించారు. ప్రధానమంత్రిగా ఆయన ఆ ప్రసంగం చేయడం తప్పు అనే మౌలిక సత్యాన్ని దేశ పౌరులు గుర్తించలేదు. రాజకీయాల పట్ల మన నిబద్ధత, బాధ్యత గురించి ఇది ఏమి చెబుతుంది? అధికారంతో మన సంబంధాలు ఏమిటి అనేది ప్రస్తుత సందర్భంలో చాలా సముచితమైన ప్రశ్న అని నేను భావిస్తున్నాను. అధికారం ప్రజలపై, ముఖ్యంగా భారతీయులపై విడ్డూరమైన ప్రభావాన్ని నెరపడం కద్దు. అధికారంలో ఉన్నవారికి విధేయులుగా ఉండేలా వ్యవహరించేలా మన సామాజిక వ్యవస్థ మనలను తీర్చిదిద్దుతోంది. పాలకులకు ప్రశ్నలు సంధించేవారు సైతం ఈ దాస్యతత్వాన్ని రక్త గతం చేసుకున్నవారే కావడం గమనార్హం. ప్రశ్నించడమనేది అధికారం ద్వారా నియంత్రితమవుతోంది. ఇప్పటికే అధికారంలో ఉన్న శ్రేణులు యథాతథంగా కొనసాగేలా మాత్రమే ఆ ప్రశ్నల తీరు తెన్నులు ఉండేలా అధికారంలో ఉన్నవారే నిర్దేశించడం జరుగుతోంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే అధికారంలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే ప్రశ్నలు వేసేందుకు అనుమమతించరు. ప్రస్తుత అధికార అసమతౌల్యతలు మరింత దృఢమయ్యేలా మాత్రమే ప్రశ్నించే వైఖరులు ఉండి తీరాలి. అసలు అధికారంలో ఉన్నవారి చర్యలు, నిర్ణయాలను నిశితంగా ప్రశ్నించాలన్న ఆలోచనే చాలా మందికి ఉండదు. ప్రశ్నించినా సహేతుకమైన, సబబైన సమాధానాలను వారు డిమాండ్ చేయరు. ఒకరి అదుపాజ్ఞలలో ఉండడం, చెప్పింది చేయడమే చాలా సహజ విషయంగా మన సమాజంలో పరిగణన పొందుతోంది. తమిళ మహాకవి సుబ్రమణ్య భారతి ఈ మనోవైఖరిని ఆక్షేపించారు. 'బానిసత్వంలోనే ఉండిపోవాలనే ఆరాటానికి మనం ఎప్పుడు స్వస్తి చెప్పుతాం?' అని ఆయన ప్రశ్నించారు. వలస పాలన కాలంలో ఆయన ఈ ప్రశ్న వేసినప్పటికీ, ఇప్పటికీ ఎంతో ఉపయుక్తత ఉన్న విషయమది. ఎందుకని? మానసిక దాస్యం అనేది మనలో ఇప్పటికీ నిండుగా ఉన్నది. ఈ కారణంగానే మనం మన నాయకులకు గుడ్డి విధేయత చూపుతున్నాం. ఏకీభవించనప్పుడు మౌనంగా ఉండిపోతున్నాం! ఇది మనకు తాతల తరం నుంచి వస్తున్న అలవాటు. దాన్ని కొనసాగించడమే సుఖప్రదంగా మనకు కనిపిస్తోంది. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ భూస్వామ్య, పితృస్వామ్య భావజాలాలు ఈ మానసిక దాస్యాన్ని మరింతగా దృఢతరం చేస్తున్నాయనేది ఒక నిష్ఠుర సత్యం. సరే, ప్రధాని మోదీ రాజ్యాంగ నైతికతకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు అనేది విద్యాధికులు మాత్రమే పట్టించుకునే సమస్య అని, సామాన్యులు ఎవరూ తమ నాయకులు రాజకీయ మర్యాదలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని లక్ష్యపెట్టరనే వాదన ఒకటి గట్టిగా ఉన్నది.


## క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

### - ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం : మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో సౌత్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజక వర్గంలో పార్టీ మరింత పుంజుకుంటుందని తెలిపారు. నియోజక వర్గంలో ప్రతి కార్యకర్త క్షేత్ర స్థాయిలో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ప్రజల తరపున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ ఓటిపి ప్రక్రియ కూడా వేగవంతం చేయాలని చెప్పారు. జగదంబ జంక్షన్ వద్ద పెట్రోల్ డీజిల్ సమస్యపై తన పిలుపుమేరకు నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ సంఘాల సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్‌ని పరామర్శించిన డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పితృ వియోగంతో తీవ్ర విషాదంలో ఉన్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని, జనసేన నాయకులు డాక్టర్ కందుల నాగరాజు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డాక్టర్ కందుల నాగరాజు మంత్రి మనోహర్‌ని కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దివంగత నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ హత్యను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన

### - ఏపీ డబ్ల్యూజేఎఫ్- ఏపీ బి జె ఏ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన - దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసిన జర్నలిస్ట్ యూనియన్‌లు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** చిత్తూరు జిల్లా వీ.కోట మండలం ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేసిన దుర్ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు బుధవారం నిరసన తెలిపారు. జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిపై అత్యంత కిరాతకంగా దాడి చేసి హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, స్కాములను నిర్భయంగా బయటపెడుతున్న జర్నలిస్టులపై దాడులు తగవని దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ సభ్యులు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌కు, జిల్లా ఎస్పి రాహుల్ మీనాకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ప్రతినిధులు ఆచంట వెంకట్, రాజా హుసేన్, ప్రఫుల్ల కుమార్, ఏపీ డబ్ల్యూజేఎఫ్- ఏపీ బిజెఏ యూనియన్‌ల ప్రతినిధులు మట్టపర్తి శ్రీనువాస్, కదలి రాజు, ప్రధాన కార్యదర్శులు వాకాడ బాబులు, పరమట భీమా మహేష్, సమయంతుల హరి, పళ్ళ బాబ్జి, కదలి సూరిబాబు, మహేష్, ఆకుల సురేష్, దిడ్ల మోహన్, అద్దంకి భాస్కర్, నెల్లి జగదీష్, మోతా వెంకటేశ్వరరావు, దంగేటి శ్రీనివాస్, బంగారు రాజు, చంటి, జి.భీమేష్, ప్రజాశక్తి రఘు, ఎం త్రిమూర్తులు, జాషువా, ఎం.రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో ముందుకెళ్లాలి : ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహిళా సాధికార సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి ద్వారా యువత జీవితంలో ముందుకెళ్లాలని కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సామర్లకోట పట్టణం బ్రౌన్‌పేటలో మెప్మా మహిళా సాధికారత సంస్థ (మెప్మా) ఆర్పి మడికి వీరలక్ష్మి ఏర్పాటు చేసిన "చాయ్ రాస్తా" కేంద్రాన్ని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెప్మా సంఘాల ద్వారా మహిళలు, యువత స్వయం ఉపాధి వృత్తులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు ఆర్థిక సాయం, శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని పేర్కొన్నారు. చాయ్ రాస్తా వంటి చిన్న వ్యాపారాలు ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీ విద్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అందుగుల మణికు మారి, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్ (సరోజ వాసు), తెదేపా పట్టణ అధ్యక్షులు బదుగు శ్రీకాంత్, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి పిట్టా జానకిరామారావు, నాయకులు మడగల శ్యామ్ కుమార్, రాజలా శ్రీను, తుమ్మల ప్రసాద్, అడబాల కుమార స్వామి, పెంకే వెంకటలక్ష్మి, చోడిశెట్టి ఇందిరా, రాయుడు శ్రీదేవి, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, షేక్ సూరజ్, స్థానిక జనసేన నాయకులు, మెప్మా సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


## మత స్వేచ్ఛకు విఘాతం కలిగించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలి

### - కాకినాడలో క్రైస్తవుల శాంతి ర్యాలీ



**కాకినాడ, (రాజధాని వార్తలు):** మత స్వేచ్ఛకు విఘాతం కలిగించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ కాకినాడ డిస్ట్రిక్ట్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ భానుగుడి సెంటర్ నుండి కలెక్టరు కార్యా లయం వరకు వేలాది మంది క్రైస్తవులు శాంతియు తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొమ్మేటి సాగర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ కల్పించాలని ఆయన అన్నారు. ఈ ర్యాలీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ విన్నపానికి సూచనప్రాయంగా వెల్లడించడం మాత్రమేనని, తదనంతరం దీనిపై కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన అన్నారు. రెవ.జోషఫ్ బెన్నీ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల హక్కులకు భంగం కలిగించే రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ ర్యాలీలో పాండిచ్చేరి మాజీ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు పాల్గొని సంఘీభావం తెలుపుతూ క్రైస్తవులు పోరాడే న్యాయపోరాటానికి తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ ర్యాలీ అనంతరం క్రైస్తవ సంఘాల నాయకులు జిల్లా కలెక్టరు హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీలో రెవ.విక్టర్ సామ్యూల్, జాషువా గిరి, ఎంఎస్.విలియమ్స్, రెవ.పరిమి ఇస్సాకు, మిస్సా విజయ్ కుమార్, సాధనాల రాజాజీ, క్రిష్టాఫర్, శీరం ఐజాక్, విక్టర్ శామ్యూల్, సురేంద్ర, సోనీఉడ్, జార్జి శ్రీమంతుల, ఎం.స్టీఫెన్ ఆనంద్, కె.జాన్ వెస్లీ, కాకినాడ జిల్లాలో గల 21 మండలాల నుండి సుమారు 7 వేల మందికి పైగా క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవ సంఘాల సభ్యులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## తిరుమల ఎక్స్‌ప్రెస్ గుంతకల్ వరకు పొడిగింపు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** విశాఖ-తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్ వరకు పొడిగించినట్లు సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం రమేశ్ తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ నెంబర్ 18521/18522 రైళ్లు ఇకపై రెగ్యులర్ సర్వీసులుగా అందుబాటులో ఉంటాయన్నారు. రైల్వే శాఖ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రయాణికులు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనుందని, మే నెల 12వ తేదీన గుంతకల్‌లోఈ రైలు ప్రారంభమవుతుండగా 13వ తేదీ విశాఖపట్నం నుంచి బయలుదేరి దువ్వాడ, కడప, ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గూటి మీదుగా గుంతకల్ వరకు ఈ రైలు ప్రయాణం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం సామర్లకోట రైల్వే స్టేషన్లలో సంప్రదించాలని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో ఉన్న ఏకైక పి.ఎం శ్రీ మునిసిపల్ హైస్కూల్ అయోధ్య రామపురంలో విద్యార్థులకు వొకేషనల్ ఎడ్యుకేషన్, లాబొరేటరీస్ లైబ్రరీ, క్రీడ స్థలం, స్కౌట్స్ గైడ్స్ వంటి అనేక అదనపు సౌకర్యాలను సద్వినియోగం చేసుకొనేందుకు తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ స్థానిక పిఎం శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ అయోధ్యరామపురం ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. కరపత్రాల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి తమ పాఠశాల అకడమిక్ రికార్డు చూసి సరైన ఎంపిక చేసుకోవాలని హెచ్ ఎం, టీచర్లు కోరుతూ ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీచర్లు ఎం హరనాథ్, పి బ్రహ్మానందం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హీరో-డైరెక్టర్-హీరోయిన్.. ఒక్క ప్రశ్నతో రివీల్ అయిందిగా!



రీసెంట్‌గా జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో చిన్న ఇన్సిడెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసింది. బేబీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ హీరో హీరోయిన్లు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ జంటగా నటిస్తున్న కొత్త చిత్రం ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్. ఆ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, టీజర్ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఆ ఈవెంట్‌లో మూవీ టీమ్ సినిమా విశేషాలు పంచుకుంటుండగా, ఓ ప్రశ్న కాసేపు అసౌకర్యానికి గురయ్యేలా చేసింది. బేబీ తర్వాత వైష్ణవి తన ఇమేజ్ మార్చుకోవాల్సిన అవసరం ఉందా? ఎపిక్ ఆ మార్పుకే సంకేతమా? అనే యాంగిల్‌లో ప్రశ్న రావడంతో, ఆమె వెంటనే సమాధానం ఇవ్వలేకపోయారు. కాసేపు ఆలోచనలో పడిపోయిన ఆమె పరిస్థితి గమనించిన హీరో ఆనంద్, దర్శకుడు ఆదిత్య హాసన్ వెంటనే స్పందించారు. మొదటగా దర్శకుడు ఆదిత్య హాసన్ ప్రశ్నను క్లారిటీ చేసేందుకు ప్రయత్నిస్తూ.. ఎవరి కోణంలో ఆ ఇమేజ్ మార్పు అంటూ తిరిగి ప్రశ్నించారు. ఆ తర్వాత హీరో ఆనంద్ దేవరకొండ ముందుకు వచ్చి తన హీరోయిన్‌గా అండగా నిలిచారు. సినిమా పాత్రల గురించి మాట్లాడేటప్పుడు, నటీనటుల ఇమేజ్ కంటే కథలోని క్యారెక్టర్ ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. “ఒక హీరో లేదా హీరోయిన్ కెరీర్ మొత్తం ఒకే ఇమేజ్‌ను కొనసాగించడం సాధ్యం కాదు. ప్రతి సినిమాలో పాత్రను బట్టి మార్పులు రావడం సహజం. బేబీలో వైష్ణవి చేసిన పాత్రను ప్రేక్షకులు ఎంతో మెచ్చుకున్నారు. ఇప్పుడు ఎపిక్‌లో కూడా ఆమె స్ట్రాంగ్ రోల్‌లో కనిపించనుంది” అని ఆనంద్ వివరించారు. అంతేకాకుండా, సినీ ఇండస్ట్రీలో స్ట్రాంగ్ ఉమెన్ రోల్స్ అరుదుగా వస్తాయని ఆయన గుర్తు చేశారు. “సాధారణంగా ఏడాదికి ఒకటి లేదా రెండు సినిమాల్లో మాత్రమే స్ట్రాంగ్ ఫిమేల్ రోల్స్ ఉంటాయి. అలాంటిది వైష్ణవికి మూడేళ్లలోనే రెండు మంచి పాత్రలు రావడం గొప్ప విషయం” అని అన్నారు. అప్పుడు వైష్ణవి కూడా చిరునవ్వుతో స్పందించారు. ఆ ఇన్సిడెంట్ మొత్తం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా హీరోయిన్‌కు హీరో, దర్శకుడు ఇచ్చిన మద్దతు పట్ల పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇండస్ట్రీలో సాధారణంగా హీరోలే ఎక్కువగా ఫోకస్‌లో ఉండే పరిస్థితుల్లో, హీరోయిన్‌కు ఇలా అండగా నిలవడం మంచి సంకేతమని సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఉమెన్ క్యారెక్టర్స్‌కు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉన్న సమయంలో, ఇలాంటి రెస్పాన్సులు ఎంకరేజ్ చేస్తాయని అంటున్నారు. మరోవైపు ఆ సంఘటనతో ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్’ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటికే బేబీ సినిమాతో హిట్ కాంబినేషన్‌గా గుర్తింపు పొందిన ఆ జంట.. మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందా అన్న ఆసక్తి నెలకొంది. టీజర్‌కు వస్తున్న రెస్పాన్స్ కూడా పాజిటివ్‌గా ఉండటం గమనార్హం. మొత్తానికి, ఒక చిన్న ప్రశ్నతో మొదలైన ఇన్సిడెంట్.. హీరో–హీరోయిన్–డైరెక్టర్ మధ్య ఉన్న కోపరేషన్‌ను రివీల్ చేసింది. ఇదే ప్రేక్షకులు కోరుకునే సహకారం అనే చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.

# కల్కి 2 : రెండు పుకార్లలో ఒకటి క్లారిటీ!



ప్రభాస్ హీరోగా రూపొంది బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ‘కల్కి’ సినిమాకు సీక్వెల్ రావాల్సి ఉంది. దర్శకుడు నాగ్ అశ్విన్ ఆ పనిలోనే ఉన్నాడని సమాచారం అందుతోంది. అయితే సీక్వెల్‌కి సంబంధించి ఇప్పటికే కొన్ని సీన్స్ చిత్రీకరణ జరిపారని, మరో రెండు మూడు నెలల షూటింగ్ జరిపితే సినిమా పూర్తి కానున్నట్లు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఆ విషయమై ఎలాంటి క్లారిటీ లేదు. భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చూపించిన కల్కి కి సీక్వెల్‌గా రాబోతున్న కల్కి 2లో మాత్రం చాలా వెనక్కి తీసుకు వెళ్లబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అసలు విషయం ఏంటి అనేది క్లారిటీ రావాల్సి ఉంది. కల్కి వచ్చి రెండు ఏళ్లు కావస్తోంది. కానీ ఇప్పటి వరకు సీక్వెల్ కు సంబంధించిన ఎలాంటి అప్డేట్ లేదు. కానీ మీడియాలో మాత్రం ఈ సినిమా గురించి ఈ రెండేళ్లలో ఎన్నో పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. కల్కి 2లో హీరోయిన్‌గా దీపికా పదుకునే... కల్కి 2 కి సంబంధించి ప్రధానంగా హీరోయిన్ దీపికా పదుకునే తప్పుకుంది అనే పుకార్లు వినిపిస్తున్నాయి. స్పిరిట్ నుంచి తప్పుకున్న తర్వాత దీపికాను కల్కి 2 నుంచి కూడా తప్పించారని, ఆమె వర్కింగ్ స్టైల్, ఇతర విషయాలతో దర్శక నిర్మాతలకు ఇబ్బందిగా ఉండటం వల్ల చేసేది లేక, తప్పనిసరి పరిస్థితుల్లో కల్కి 2 నుంచి దీపికాను తప్పించారనే పుకార్లు పెద్ద ఎత్తున షికారు చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న దీపికా పదుకునే కల్కిలో నటించడం వల్ల మంచి బిజినెస్ జరిగిన మాట వాస్తవం. అయితే సీక్వెల్‌లో ఆమె నటించకున్నా పెద్దగా వచ్చే నష్టం ఏమీ లేదని మేకర్స్ భావిస్తున్నారట. అందుకే ఈ సినిమా నుంచి ఆమెను తప్పించారనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ విషయమై మేకర్స్ నుంచి ఎలాంటి క్లారిటీ లేదు. అయితే మరో పుకారుపై మాత్రం తాజాగా క్లారిటీ వచ్చింది.

**ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబోలో...**

ప్రభాస్ అభిమానులతో పాటు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న ‘కల్కి 2’ సినిమాలోని ముఖ్య పాత్ర కోసం జేడీ చక్రవర్తిని ఎంపిక చేశారనే వార్తలు వస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఈ వార్తలు ప్రముఖ మీడియా సంస్థలు సైతం కవర్ చేశాయి. సోషల్ మీడియాలో ప్రముఖంగా ఈ విషయం గురించి పోస్ట్‌లు రావడం జరిగింది. ఎట్టకేలకు నటుడు జేడీ చక్రవర్తి ఈ విషయం గురించి స్పందించాడు. ఈయన నటించిన గాయపడ్డ సింహం సినిమా విడుదల సందర్భంగా ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కల్కి 2 సినిమాలోని పాత్ర విషయమై స్పందించాడు. కల్కి సినిమాలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం అని ప్రకటించాడు. అంతే కాకుండా తాను ఇన్ని రోజులు కల్కిలో తాను నటిస్తున్నట్లుగా వచ్చిన వార్తలను ఎంజాయ్ చేసినట్లుగా చెప్పుకొచ్చాడు.


**మహాభారతం నేపథ్యంలో ఈ సినిమా...**

కల్కి 2 సినిమాలో కొత్త పాత్రలు చాలానే ఉండబోతున్నాయట. అయితే కొత్త నటీనటులు కాకుండా మొదటి పార్ట్‌లో కనిపించిన వారిలోనే ఎక్కువ శాతం మంది సెకండ్ పార్ట్‌లో కనిపించబోతున్నారట. అందుకే కొత్త నటీనటులు ఎక్కువ శాతం సెకండ్ పార్ట్‌లో కనిపించబోరని సమాచారం అందుతోంది. మహాభారతంతో ముడిపడి కల్కి 2 సినిమాను నడిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. సెకండ్ పార్ట్‌లో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాత్రలు కాస్త ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే 2027లో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు గతంలో చెప్పుకొచ్చాడు.

కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్‌డేట్ లేదు, కనుక మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈలోపు మరెన్ని పుకార్లు ఈ సినిమా గురించి వస్తాయో చూడాలి. ఇటీవల వచ్చిన రెండు పుకార్లలో దీపికా ఔట్ అనే విషయమై క్లారిటీ లేదు, జేడీ చక్రవర్తి నటించాడు అనే విషయం పూర్తిగా అవాస్తవం అని తేలిపోయింది. ఆయన కల్కి 2 కోసం కనీసం ఒక్క రోజు షూటింగ్‌లో పాల్గొనలేదని చెప్పుకొచ్చాడు.

# మాస్ కా బాప్.. క్లాస్ కా బాప్ కలుస్తున్నారా?





టాలీవుడ్‌లో ఓ క్రేజీ వార్త హల్ చల్ చేస్తోంది. అసలైన క్లాస్–మాస్ కలిస్తే ఎలా ఉండబోతుందో నిరూపించడానికి ఓ ద్వయం రెడీ అవుతోందట. వివరాల్లోకి వెళ్తే..సున్నితమైన భావోద్వేగాలకు, స్వచ్ఛమైన ప్రేమకథలకు కేరాఫ్ అడ్రస్ అయిన దర్శకుడు శేఖర్ కమ్ముల.. నందమూరి బాలకృష్ణతో ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఒకరు మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించే గాడ్ ఆఫ్ మాసెస్ అయితే మరొకరు మట్టి వాసన కలిగిన క్లాస్ సినిమాల దర్శకుడు. ఈ ధృవాల కలయిక వినడానికే వింతగా ఉన్నా ఒకవేళ ఇది నిజమైతే టాలీవుడ్‌లో ఓ సరికొత్త ప్రయోగానికి తెరలేచినట్లే. సాధారణంగా బాలకృష్ణ సినిమా అంటే హై–వోల్టేజ్ యాక్షన్, భారీ డైలాగులు, ఊహకందని మాస్ ఎలిమెంట్స్ ఉంటాయి. మరోవైపు శేఖర్ కమ్ముల సినిమాలో సహజత్వం, నిశ్శబ్దంగా సాగే సన్నివేశాలు ప్రధానాకర్షణ. అయితే బాలకృష్ణను ఓ కొత్త కోణంలో అంటే ఆయనలోని నటుడిని క్లాస్ టచ్‌తో చూపించేందుకు కమ్ముల ఓ బలమైన కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. లీడర్ వంటి పొలిటికల్ థ్రిల్లర్ తీసిన అనుభవం కమ్ములకు ఉండటంతో బాలయ్య ఇమేజ్‌కు తగ్గట్టుగా ఓ పవర్ ఫుల్ సోషల్ మెసేజ్ ఉన్న క్లాస్ కథతో ఆయనను ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయట. వీరిద్దరి కలయికపై నెటిజన్లలో అనేక సందేహాలు మొదలయ్యాయి. మాస్ కమ్ములా.. క్లాస్ బాలయ్యా ఇది ఎలా సెట్ అవుతుంది అని కొందరు ప్రశ్నిస్తుంటే మరికొందరు మాత్రం ఇది ఒక మాస్టర్ స్ట్రోక్ అవుతుందని భావిస్తున్నారు. ఎందుకంటే బాలకృష్ణ ఇటీవల అన్‌స్టాపబుల్ షో ద్వారా తనలోని సరదా కోణాన్ని, సహజత్వాన్ని ప్రేక్షకులకు దగ్గర చేశారు. శేఖర్ కమ్ముల మార్కు టేకింగ్‌లో బాలయ్య బాడీ లాంగ్వేజ్ ఓ సరికొత్త ఒరవడిని సృష్టిస్తుంది. పక్కా రియలిస్టిక్ డ్రామాలో బాలయ్య కనిపిస్తే ఆ ఇంపాక్ట్ మరో స్థాయిలో ఉంటుందని కమ్ములా అంచనా వేస్తున్నారు. గతంలో రజనీకాంత్ వంటి స్టార్ హీరోతో పా రంజిత్ కబాలి, కాలా వంటి సినిమాలు చేసినప్పుడు ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తమయ్యాయి. స్టార్ హీరోల చుట్టూ ఉండే రెగ్యులర్ కమర్షియల్ ఫార్ములాను బ్రేక్ చేసి వారిలోని నటుడిని ఆవిష్కరించే ప్రయత్నం దర్శకుడు చేస్తే అది క్లాసిక్‌గా నిలిచిపోతుంది. శేఖర్ కమ్ముల అదే వ్యూహంతో బాలయ్య కోసం ఓ విలక్షణమైన పాత్రను డిజైన్ చేస్తున్నారని సమాచారం. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్ ఉన్న కథలో బాలయ్యను చూడటం అభిమానులకు కొత్త అనుభూతినిస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం అంత సులభం కాదు. బాలయ్య ఇమేజ్‌ను కాపాడుతూనే తన మార్కు సహజత్వాన్ని వదులుకోకుండా శేఖర్ కమ్ముల కథను ఎలా మలుస్తారనేది ఆసక్తికరం. ఇద్దరి మధ్య అభిప్రాయాలు కలిస్తే టాలీవుడ్ చరిత్రలో ఇదొక అరుదైన, సాహసోపేతమైన కాంబినేషన్ అవుతుంది.

ప్రస్తుతం బాలయ్య వరుసగా మాస్ సినిమాలతో దూసుకుపోతున్నారు. ఈ గ్యాప్‌లో కమ్ములా స్క్రిప్ట్ పనులు పూర్తైతే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. శేఖర్ కమ్ముల క్లాస్ టేకింగ్‌లో బాలయ్య మాస్ పర్ఫార్మెన్స్ తోడైతే అది విభిన్నమైన సినిమాటిక్ ఎక్స్‌పీ రియన్స్ అవుతుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డుల కంటే? గొప్ప నటుడిని ఒక గొప్ప దర్శకుడు ఎలా ఆవిష్కరించాడనే విషయంలో సినిమా చర్చనీయాంశం అవుతుంది.

# నెల ముందే బుకింగ్స్... అయినా రెస్పాన్స్ జీరో



బాలీవుడ్‌లో కొత్త సినిమా రిలీజ్ అవుతున్నప్పుడల్లా స్టార్ పవర్, మార్కెటింగ్, హైప్.. ఇవి మూడూ కలిసి పనిచేస్తేనే ఓపెనింగ్ బలంగా ఉంటుందనే భావన ఉంది. అయితే ఈ మే 1న రిలీజ్‌కు రెడీ అయిన ఏక్ దిన్ మూవీ మాత్రం ఆ సమీకరణాన్ని పూర్తిగా ప్రశ్నిస్తోంది. సాయి పల్లవి బాలీవుడ్ డెబ్యూ, ఆమిర్ ఖాన్ కొడుకు జునైద్‌ఖాన్ నటిస్తున్నారు. ఆమిర్ ఖాన్‌లాంటి స్టార్ హీరో కం ప్రొడ్యూసర్ ఈ సినిమాను నిర్మించారు. ఇంత స్టార్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నప్పటికీ, ఏక్ దిన్ ఆశించిన స్థాయిలో బజ్‌ను సృష్టించలేకపోవడం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ పరిస్థితి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా రిలీజ్‌కు కొద్ది రోజుల ముందు ఓపెన్ చేసే బుకింగ్స్‌ను ఈ సినిమా కోసం దాదాపు ఒక నెల ముందే ప్రారంభించారు. అయినప్పటికీ, ఆ స్ట్రాటజీ పెద్దగా రిజల్ట్ ఇవ్వలేదనే చెప్పాలి. బుకింగ్స్ డల్‌గా ఉండటం, ఓపెనింగ్ రూ.1– రూ.2 కోట్ల మధ్యే ఉండొచ్చన్న అంచనాలు వినిపించడం.. ఇవన్నీ కలిపి ఏక్ దిన్‌పై ఉన్న క్రేజ్ ఎంత తక్కువగా ఉందో స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు హైప్ లేకుండా రిలీజ్ అవుతున్న మూవీ అనే ట్యాగ్ అంటుకుంది. ఇక డెబ్యూ యాంగిల్ చూస్తే, సాయి పల్లవి వంటి నేచురల్ టాలెంట్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడం ఒక పెద్ద ప్లస్‌గా భావించాలి. అదే సమయంలో జునైద్ ఖాన్‌కు ఇది కీలకమైన మొదటి అడుగు. కానీ ఈ సినిమా ఇప్పటివరకు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో వెనుకబడింది. దీన్ని బట్టి చూసుకుంటే, పేరు, బ్యాక్‌గ్రౌండ్ మాత్రమే ఆడియన్స్ ను కనెక్ట్ చేయడానికి సరిపోవు, దానికి తోడు ప్రేక్షకులు ఎట్రాక్ట్ అయ్యే కంటెంట్ కూడా కావాలనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమిర్ ఖాన్ ఫ్యాక్టర్ కూడా ఈ అంశాన్ని హైలైట్ చేస్తోంది. బాలీవుడ్‌లో కంటెంట్ డ్రివెన్ సినిమాలకు ఆమిర్ బ్రాండ్ ఓ నమ్మకం.

కానీ ఈసారి ఆ బ్రాండ్ కూడా ఓపెనింగ్ బజ్‌ను తీసుకురాలేకపోయింది. మార్కెటింగ్ పరంగా చూస్తే, ముందుగానే బుకింగ్స్ ఓపెన్ చేయడం, ప్రమోషన్స్ చేయడం.. ఇలా అన్ని ఎఫర్ట్స్ ఉన్నప్పటికీ, అవి ఆడియన్స్‌లో ఆసక్తిని రేపలేకపోవడం స్ట్రాటజీ బ్యాక్‌ఫైర్ అయిందా? అనే సందేహాన్ని కలిగిస్తోంది. అయితే, ఈ కథ ఇక్కడితో ముగిసిపోయిందని చెప్పడం తొందరపాటు అవుతుంది. ఆమిర్ ఖాన్ స్వయంగా ఈ సినిమాపై నమ్మకం వ్యక్తం చేస్తూ, ఇది స్లోగా పిక్ అవుతుందని భావిస్తున్నారు. మార్నింగ్ షో తర్వాత సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, ఏక్ దిన్ మెల్లిగా రన్‌ను పెంచుకునే అవకాశాలు లేకపోలేదు. మరి ఆమిర్ అంచనాల్ని, నమ్మకాన్ని ఏక్ దిన్ సినిమా ఎంతవరకు నిలబెడుతుందో చూడాలి.

# గజపతినగరం అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి, నాణ్యత ప్రమాణాలు పాటించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** బుధవారం గజపతినగరం లోని అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటీన్ నిర్వహణ తీరును పర్యవేక్షించిన కలెక్టర్, అక్కడ అందుతున్న భోజన నాణ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు మరియు నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. నిరంతరం క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీలో ఏఎంసీ చైర్మన్ పి.వి గోపాలరాజు, ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

# తప్పులు లేని ఖచ్చితమైన హద్దులతో పట్టాదారు పాస్ పుస్తకాలను అందించడమే రీ సర్వే లక్ష్యం

**- చోడవరం గ్రామంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్**







**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లాలో భూ రికార్డులను సమగ్రంగా సరిదిద్దుతూ, రైతులకు ఖచ్చితమైన హద్దులతో పట్టాదారు పాస్ పుస్తకాలను అందించడమే లక్ష్యంగా రీ-సర్వే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాముఖ్యతతో అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డి.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ తొట్టంబేడు మండలం, చోడవరం గ్రామంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఆర్డీవో భానుప్రకాష్ లతో కలసి జిల్లా కలెక్టర్ రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వేలో ముఖ్య భాగమైన "గ్రౌండ్ ట్రూతింగ్" ప్రక్రియను గ్రామంలో ప్రారంభించినట్లు తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్ ద్వారా సర్వేయర్లు నేరుగా భూమి వద్దకు వెళ్లి, రైతుల సమక్షంలోనే హద్దులు కొలిచి, భూమి విస్తీర్ణాన్ని ఖచ్చితంగా నిర్ధారిస్తారన్నారు. ఈ ప్రక్రియకు ముందుగా రైతులకు నోటీసులు ఇచ్చి, నిర్ణీత తేదీన భూమి వద్దకు రావాలని సమాచారం అందజేస్తారనీ ఈ రీ-సర్వే కార్యక్రమం ద్వారా పాత పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఉన్న లోపాలను సరిదిద్దడం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు మరియు పూర్వపు రికార్డుల ఆధారంగా భూమి వివరాలను సరిచేయడం, వారసత్వ (ఫౌతీ) కేసులను పరిష్కరించి, ప్రస్తుత హక్కుదారుల పేర్లను నమోదు చేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతులు పేరు, వయస్సు, ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయడం, 22-ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం బయోమెట్రిక్ మరియు ఈ-కేవైసీ ప్రక్రియ ద్వారా రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తారని అన్నారు.

జిల్లాలో ఉన్న 980 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే 270 గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగతా గ్రామాల్లో దశలవారీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి రైతులు సహకరించా లని, రెవెన్యూ సిబ్బంది ఇచ్చే సమాచారానికి అనుగు ణంగా భూమి వద్దకు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని ఉప యోగించుకుని అన్ని రకాల రెవెన్యూ సమస్యలను ఒకేసారి పరిష్క రించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాం గం రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత జాగ్రత్తగా నిర్వహిస్తూ, ఎటు వంటి తప్పులు లేకుండా ఖచ్చితమైన భూ రికార్డులను సిద్ధం చేసి రైతులకు అందించడానికి కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వే అరుణ్ కుమార్, తాహశీల్దార్ భారతి, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**రామభద్రపురం, (విజయనగరం), (రాజధాని వార్తలు):** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సీ) జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముందుగా హాజరు పట్టికను తనిఖీ చేసిన కలెక్టర్, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం మందుల నిల్వలు, ల్యాబ్ సౌకర్యాలు మరియు వార్డుల్లోని పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించారు. రోగులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న చికిత్స మరియు సిబ్బంది తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరియు అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట పలువురు రెవెన్యూ మరియు ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసమర్ధతే కారణం

**- నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ దుర్గాప్రసాద్**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరతకు ప్రభుత్వ అసమర్ధ పాలనే కారణమని నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ సరిది దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మధుపాడలో విలేకరులతో మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ ఇబ్బందులు దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరడం..నో డీజిల్ బోర్డులు బంకుల్లో దర్శనం ఇవ్వడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఇంధన కొరతను నివారించాలని అందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**







**రామభద్రపురం, (విజయనగరం), (రాజధాని వార్తలు):** నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే అతిపెద్ద మరియు శాశ్వతమైన ఆస్తి చదువు మాత్రమేనని, విద్య ద్వారానే విద్యార్థులకు గొప్ప భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. బొబ్బిలి మండలం పారాది గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయనతో కలిసి ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వసతి గృహంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యా వాతావరణం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలని, జిల్లాలో ఒక్క డ్రాపౌట్ కూడా లేకుండా చూడాలని అధికారులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామస్థుల కోరిక మేరకు పారాదిలో ప్రస్తుతం తాత్కాలిక భవనంలో హాస్టల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే పాఠశాల భవనం సమీపంలోని ఐదు ఎకరాల ఖాళీ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో పారాది వంతెన పనులను జూన్ నెలలోగా పూర్తి చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోతిశ్రీ, ఆర్డీవో మోహనరావు, సహాయ బిసి సంక్షేమ అధికారిణి రాజులమ్మ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎంపిటిసి ఉమ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** ఇటీవల పెట్రోల్ మరియు డీజిల్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో, సామాన్య ప్రజలకు మరియు వాహనదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేం దుకు సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ ఈరోజు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పట్టణంలోని జి.ఎన్.టి రోడ్డులో ఉన్న తాజ్ పెట్రోల్ బంక్‌ను అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బంక్‌లోని స్టాక్ రిజిస్టర్లు, ఇంధన నిల్వలు మరియు సరఫరా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇంధన సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజల పనులు ఆగిపో కుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. కొరత సాకుతో కృత్రిమ అభావం సృష్టించినా లేదా వినియోగదారులకు ఇబ్బంది కలిగించినా సహించేది లేదని హెచ్చరించారు. బంక్ వద్ద ఉన్న వినియోగదారులతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి, ఇంధన నాణ్యత మరియు కొలతలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సత్వర స్పందన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఏ సమయంలోనైనా ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట తహశీల్దార్, సర్కిల్ ఇన్స్పె క్టర్, సబ్ ఇన్స్పెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**పెళ్లకూరు, (రాజధాని వార్తలు):** చిల్లకూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పిల్లమేటి మురళి కుమార్తె సంధ్యారాణి ముఖేష్ వివాహం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్.వి.ఎస్ కళ్యాణ మండపం నందు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మండల పరిషత్ అధ్యక్షులు పోలంరెడ్డి శేఖర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని దీవించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రఘు నాయుడు, పాండు, రమణా రెడ్డి, సాగి జితేంద్ర, బండి బాలు, అట్ల గోపాల్, అట్ల కృష్ణయ్య, చిల్లకూరు మాజీ సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి, తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**- పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్‌కు ధన్యవాదాలు - కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో అమలు - కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుంది**





**ఇందుకూరుపేట, (రాజధాని వార్తలు):** ఇందుకూరు పేట మండలం మైపాడు సమీపంలోని కృష్ణాపురం గ్రామంలో జరిగిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక కార్యక్రమలో కోవూరు ఎమ్మెల్యే మరియు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అండగా ఉంటుందన్నారు. తనను తెలుగుదేశం పార్టీలో అత్యున్నత పదవి అయిన పొలిట్ బ్యూరో సభ్యురాలుగా నియమించడం పట్ల ఆమె తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐటి మంత్రి నారా లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయిన ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. మత్స్యకార సేవలో పథకంలో గతంలో 10 వేల రూపాయలు వేట విరామ భృతిని ఇప్పుడు 20 ఇస్తున్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా మత్స్యకారులకు గుర్తు చేశారు. మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పడవలు, వలలు అందజేయనుందని ఆమె పేర్కొన్నారు. కొరుటూరు కృష్ణాపురం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి 1 కోటి రూపాయలు మంజూరు ఉన్నాయని త్వర లోనే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే స్థానిక పాఠశాలలో అదనపు గదుల నిర్మించాలన్న స్థానికుల కోరిక మేరకు ఆమె



స్పందిస్తూ.. వేసవి సెలవల్లోపు అదనప గదుల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయన్నట్లు ఆమె వెల్లడించారు. కృష్ణాపురం గ్రామానికి అంతర్గత రోడ్లు డ్రైన్లులాంటి కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్ళలో అమలు అవుతున్నాయని ఆమె ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట మండలం మరియు మైపాడు, కృష్ణాపురం గ్రామాలకు చెందిన మత్స్యకార పెద్దలు కాపులు, టీడీపీ సీనియర్ నేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జడ్పీటీసీ వైస్ చైర్మెన్ శ్రీహరికోట జయలక్ష్మి తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి ముఖ్య నాయకులు కార్యకర్తలతో పాటు మత్స్యకార సామాజిక వర్గ పెద్దలు పాల్గొన్నారు.

# ధాన్యం పూర్తి మద్దతు ధరను పొందండి

**- ధాన్యం పరిశీలనలో జేసి అపూర్వ భరత్**



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ అపూర్వ భరత్ బుధవారం పెద్దాపురం మండలం జి రాగంపేట గ్రామంలో కోదండ రామాలయం ఎదురుగా గల ధాన్యం కళ్లాలను పరిశీలించారు. రైతులకు ధాన్యం తేమ శాతం 17 శాతం వచ్చేలా ఆరబెట్టుకోవాలని, తప్ప, తాలు లేకుండా బాగు చేసుకొని రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు పంపించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. అదేవిధంగా ఏంటియు 1156 వంటి సన్న రకాలను కూడా కొనుగోలు చేయడానికి రైస్ మిల్లర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరి కోతలకు అవసరమైన హార్వెస్టర్లకు డీజిల్ కొరత లేకుండా మండల వ్యవసాయ అధికారి, తహశీల్దార్‌లు కూపన్లు ఇవ్వాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ వెంకట లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి కె సంజయ్ కుమార్, దూసర్లపూడి యేసుబాబు, మండిపూడి బుల్లిరాజు, మాజీ సర్పంచ్ దేవెళ్ళ సతీష్, దేవెళ్ళ వెంకటేశ్వరరావు, దేవెళ్ళ సత్యనారాయణ, దూసర్లపూడి మాధవరావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి 93వ జయంతి - ఆయన అందరికీ ఆదర్శం



**కోవూరు, (రాజధాని వార్తలు):** దివంగత నేత అసెంబ్లీ టైగర్ మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి 93వ జయంతిని పునస్కరించుకొని పోతిరెడ్డి పాళెంలో ఉన్న కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైసీపీ నేతలు సుబ్బారెడ్డి పలువురు నేతలు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీ పార్టీ జిల్లా, మండల మరియు గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలు చాలా విలువైనవి




**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు శాఖ గ్రంధాలయం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కథలు చెప్పడం పుస్తకాల ప్రాముఖ్యత లైబ్రరీ విశిష్టత వంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. విడవలూరు శాఖ గ్రంధాలయంలో జరుగుతున్నటువంటి వేసవి విజ్ఞాన శిబిరాలను విడవలూరు మండల ప్రజలందరూ ఉపయోగించుకోవాలని వారి బిడ్డలకు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి దోహదపడాలని లైబ్రేరియన్ నిరూప కోరారు.

# ఘనంగా మైపాడులో నిఖిల్, నిత్యశ్రీ వివాహ వేడుకలు

**- వధూవరులను ఆశీర్వదించిన బంధు మిత్రులు, వివిధ రంగాల నేతలు**









**ఇందుకూరుపేట, (రాజధాని వార్తలు):** ఇందుకూరు పేట మండలం మైపాడు పడమటి పాళెంకు చెందిన నిఖిల్, నిత్యశ్రీకి జరిగిన వివాహ వేడుకలు అత్యంత ఘనంగా బుధవారం జరిగింది. నూతన వదు వరులను బంధువులు. మిత్రులు, పలు పార్టీ నేతలు వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులు వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అధిక సంఖ్యలో వివాహ వేడుకలకు హాజరు అయ్యారు. కాటంగారి వెంకట రమణయ్య, కూనింగారి మురళి దంపతులకు చెందిన నిఖిల్, నిత్యశ్రీలకు వివాహం జరిగింది. ఒకే గ్రామంకు చెందిన వారు కావడంతో పండగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు స్థానిక వివిధ పార్టీ నేతలు, అంగన్‌వాడీ, టీచర్‌లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు, స్థానిక మత్స్య కార పెద్దలు, కాపులు, తదితరులు పాల్గొన్నారు.

# ది రాయల్ ఫ్లోరాను బీద, చేజర్లతో కలిసి ప్రారంభించిన శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి





**నెల్లూరు /కోవూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు మినీ బైపాస్ రోడ్ లోని జిపిఆర్ గ్రాండ్ కళ్యాణ మండపం ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'ది రాయల్ ఫ్లోరా' పూల దుకాణం (పూల బొకే, కుండీలు, డెకరేషన్)ను టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వర రెడ్డి లతో కలిసి నెల్లూరు రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 'ది రాయల్ ఫ్లోరా' రూపంలో సరసమైన ధరలకు నాణ్యమైన బొకేలు అందుబాటులోకి వచ్చాయని, నెల్లూరు నగర ప్రజలు 'ది రాయల్ ఫ్లోరా' సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 'ది రాయల్ ఫ్లోరా' ప్రొప్రైటర్ చేజర్ల హరీష్‌కు శుభాకాంక్షలు తెలిపి వ్యాపారం దిన దినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు షాపు యజమానులు తదితరులు ఉన్నారు.

# లోకేశ్ విజన్‌తో విద్యార్థుల భవిష్యత్తుకు పడిన బలమైన పునాది : పల్లా

**అమరావతి, (రాజధాని వార్తలు):** విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విజన్, పక్కా ప్రణాళికతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీలో పదో తరగతి ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో అమరావతిలో ఏపీ టీడీపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావు స్పందించారు. మంత్రి నారా లోకేశ్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళికతో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడం అభినందనీయమని ఏపీ టీడీపీ చీఫ్ చెప్పారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరగడం విద్యా



రంగంలో పురోగతికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు రావడంతోపాటు బాలికలు ముందుండటం శుభపరిణామం అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

# కుప్పం విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్.. సుప్రీంకోర్టు కీలక తీర్పు




**ఢిల్లీ :** చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కుప్పం విమానాశ్రయ ప్రాజెక్టుకు పెద్ద ఊరట లభించింది. భూసేకరణపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలకు ముగింపు పలుకుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కుప్పం విమానాశ్రయం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. దీంతో ముందుగా ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

**భూసేకరణ చట్టబద్ధమే..**

ఈ ప్రాజెక్టు కోసం సుమారు 150 ఎకరాల భూమిని సేకరించేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చింది. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవంటూ చక్రపాణి రెడ్డి, ఇతరులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ పిటిషన్లు కూడా ముగిసినట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఉన్న న్యాయపరమైన అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి.

**అభివృద్ధికి మార్గం సుగమం**

ఈ తీర్పుతో కుప్పం విమానాశ్రయ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయి. ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల పెరుగుదల వంటి అంశాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. కుప్పం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ, సమీప ప్రాంతాల ఆర్థిక వృద్ధి, టూరిజం అభివృద్ధి వంటి ప్రయోజనాలు కలగనున్నాయి.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఏపీలో పెట్టుబడులకు ముందుకొచ్చిన టైటాన్ సంస్థ



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిస్థాయిలో ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో నేడు ఆంధ్రప్రదేశ్ దేశానికే పెట్టుబడుల హాబ్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. సుస్థిరమైన, నమ్మకమైన, బలమైన కూటమి పాలనపై విశ్వాసంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. సచివాలయంలోని ఆర్ అండ్ బీ, ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూ ర్వకంగా టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ గ్రూప్ చైర్మన్, సీఈఓ కె.గిరికుమార్, సంస్థ ప్రతినిధులు కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న టైటాన్ కంపెనీ నిర్వాహకులు ఆసక్తి చూపించారు. ప్రస్తుతం ఏపీలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని టైటాన్ సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. కర్నూలు ఎయిర్ పోర్టులో ఎమ్మార్వో, సిమ్యులేషన్ సెంటర్ల ఏర్పాటుకు ఈ సంస్థ ఆసక్తి చూపుతోంది. అలాగే, నంద్యాల జిల్లాలో డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపనకు సంస్థ ప్రతినిధులు ఉత్సాహం చూపించారు. తమ సంస్థకు ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మైనింగ్, ట్రేడింగ్ వంటి బహుళ రంగాల్లో ఉన్న అనుభవాన్ని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఉత్పత్తి శ్రేణితో పాటు శిక్షణ, పరీక్ష, ధ్రువీకరణ, ఉన్నతీకరణ, ఆధునికీకరణ, నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో తమకు అనుభవం ఉందని టైటాన్ గ్రూప్ నిర్వాహకులు తెలిపారు.

# మాజీ మంత్రి వివేకా హత్య కేసు.. సీబీఐ కోర్టులో కీలక పరిణామం

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ మరో కీలక దశకు చేరుకుంది. సీబీఐ కోర్టులో జరిగిన తాజా విచారణలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. వివేకా కుమార్తె వైఎస్ సునీతారెడ్డి సీబీఐ దర్యాప్తుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి పలు విషయాలను తీసుకు వచ్చారు. సీబీఐ పూర్తిస్థాయిలో సమగ్ర దర్యాప్తు చేయలేదని, ఇంకా కొన్ని విషయాలు వెలుగులోకి రాలేదని అందువల్ల మరింత దర్యాప్తునకు అనుమతి ఇవ్వాలని కోర్టును కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

**నిందితులకు పిటిషన్ కాపీలు..**

సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌కు సంబంధించిన కాపీలు ఈ కేసులోని నిందితులకు అందజేసినట్లు ఆమె తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇది కేసులో పారదర్శకతకు ముఖ్యమైన అడుగని న్యాయవాదులు భావిస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు చేపడుతున్న సీబీఐ ఇప్పటికే మూడు చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగించింది. అయితే,




సునీతారెడ్డి వాదన ప్రకారం ఇంకా పూర్తి నిజాలు బయటకు రాలేదనే అభిప్రాయం వ్యక్తమవు తోంది.

**ఈ కేసులో చైతన్యరెడ్డి, కిరణ్ యాదవ్ పాత్రపై క్లారిటీ..**

సీబీఐ తన దర్యాప్తులో చైతన్యరెడ్డి, కిరణ్ యాదవ్‌లకు కేసుతో సంబంధం లేదని తేల్చినట్లు సమాచారం. దీంతో కేసులో కొన్ని అనుమానాలు తొలగినప్పటికీ, ఇంకా ప్రధాన అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కేసులో తదుపరి విచారణను కోర్టు మే 4వ తేదీకి సీబీఐ కోర్టు వాయిదా వేసింది. ఆ రోజున సునీతారెడ్డి పిటిషన్‌పై కీలక వాదనలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

# లోకేష్‌కు అభినందనలు తెలిపిన ఎంపి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే ఆనందరావులు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన యువనేత, మంత్రి నారా లోకేష్‌కు అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అభినందనలు తెలిపారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవంలో భాగంగా తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన యువ కిశోరం, మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే ఆనందరావు, ఎంపీ హరీష్ బాలయోగిలు కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# అవసరం లేకుండా ఇంటి నుంచి బయటకు రావద్దు : విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఒక వైపు ఎండలు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. శుక్రవారం (మే1వ తేదీ) పలు జిల్లాల్లో పిడుగులతో పాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాబోయే 3 రోజులు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేశారు. గురువారం మార్కాపురం జిల్లా పొదిలిలో 37మిమీ, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కలలో 22మిమీ, నంద్యాల జిల్లా మెట్టుపల్లిలో 10.5 మిమీ వర్షపాతం నమోదయిందని వివరించారు. మరో వైపు పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరులో 45.8°C ఉష్ణోగ్రత నమోదయిందని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉష్ణోగ్రత అని చెప్పారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 45.2°C, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45°C ఉష్ణోగ్రతలు నమోదయిందని వివరించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 216 మండలాల్లో 41°C పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు తెలిపారు. పల్నాడు 28, వైఎస్సార్ కడప 26, తిరుపతి 25 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉందన్నారు. శుక్రవారం (మే 1వ తేదీ) 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైలు తెలిపారు. మరో 49 మండలాల్లో వడగాలుల ప్రభావం ఉంటుందని వివరించారు. పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లో తీవ్ర వడగాలుల ముప్పు పొంచి ఉందన్నారు.

విజయనగరం, పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఉంటుందని చెప్పారు. ఎండ తీవ్రత, ఉక్కపోత నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎండీ ప్రఖర్ జైన్ స్పష్టం చేశారు. అవసరం లేకుండా మధ్యాహ్నం వేళ.. ఇంటి నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. కర్ణాటక నుంచి మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి ప్రభావం కారణంగా ఈ పరిస్థితులు ఉత్పన్నమైనట్లు విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ వివరించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985,
Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan